# తరం - అంతరం

## సుగుణా!

మధుతో నువ్వు స్నేహంగా వుండటమూ, క్రితం సారి మీ ఇద్దరూ కలిసే ఊరికి రావడం చూసినప్పట్నుంచీ, ఇటువంటి సమస్య ఎప్పుడో ఎదురు కావచ్చు అనుకుంటూ నేవున్నాను. అనుకున్నట్టే అయింది. నిజానికిది ఇతరులవిషయంలో నైతే సమస్యకాదు, సంతోషించవలసిన సంగతి. ఉద్యోగాలు చేసుకుంటున్న వాళ్ళిద్దరూ ప్రేమించుకుని, కట్నాలప్రసక్తి లేకుండా పెళ్ళి చేసుకోబోతున్నారంటే ఏతండ్రయినా సంతోషించకుండా వుంటాడా? నీ తండ్రిమాత్రం అటువంటి సంతోషం పొందలేకపోగా, భయపడుతున్నాడు. సుగుణా! ఇప్పుడు నేను చెప్పబోయేది జాగ్రత్తగా విని, అంతకంటే జాగ్రత్తగా, సావకాశంగా ఆలోచించు. నాభయం అకారణమో, సకారణమోచెప్పు.

మనింట్లో రేడియో పెట్టుకున్న టేబిల్ పైన గోడకు వేలాడుతూ, మసిపట్టిన పాత చవకరకం గ్రూప్ ఫోటో ఒకటి ఇటీవలి వరకూ వుండేది. అందులో వుండే దెవరో చాలా సార్లు అడిగి చెప్పించుకున్నావు నువ్వు. నువ్వడక్కుండానే ఇప్పుడు మళ్ళీ చెప్పవలసివస్తోంది. ఆ ఫోటో లో ఓమూల్న, చొక్కాలేకుండా తలగుడ్డ చుట్టుకునుండిన ఓమనిషి నీకు జ్ఞాపకం వున్నాడా? అతను అప్పటి మనజీతగాడు. ఏమిటిదంతా అనుకుంటున్నావా? మధుతో నీకు పెళ్ళి జరిగితే అప్పటి మనజీతగాడు నీకు మామ అవుతాడు, నాకు వియ్యంకుడు, అవుతాడని చెప్పడానికి. అప్పటి 'ఎల్లుగాడు' ఇప్పడు మధు తండ్రి ఎల్లయ్య. ఈ సంగతి నీకు తెలీనట్టే మధుకూ తెలిసివుండకపోవచ్చు. ఎల్లయ్య మనింట్లో జీతానికి చాలించుకున్నాక, మనదేకొంత భూమి కౌలుకు తీసుకున్నాడు. ఆ తర్వాత చిన్న చిన్న వ్యాపారాలూ, కాంట్రాక్టులూ చేసి బాగా సంపాదించాడు. పిల్లల్ని చదివించుకున్నాడు. ఇప్పుడు అన్ని విధాలా మన కంటే పై స్థాయిలో నే వున్నాడు. 'అయినప్పుడు అభ్యంతరమేమిటి?' అని అడుగుతావేమో, విను.

ఎల్లయ్య ఇంత పై కొచ్చినా, మనింట్లో ఒకప్పుడు తను జీతానికుండిన సంగతి మరచి పోలేదు. ఒకవేళ, మరచిపోయినాడనుకుంటే, నువ్వు కోడలివైతే ఆసంగతి గుర్తు చేస్తూ వుంటావు. అటువంటి గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ వుండటం ఎవరికీ ఇష్టముండదని వేరే చెప్పనక్కర్లేదు. ఇంకోప్రమాదమూ వుంది. నీకు నేనిచ్చిన స్వాతంత్ర్యం వల్ల, ఎల్లయ్య ఆలోచనకు భిన్నంగా వుండవలసివస్తే, తనను చులకనగా చూస్తున్నట్టు భావించవచ్చు. నీపుట్టింట్లో ఒకప్పుడు జీతగాడుగా వున్నందు వల్లనే, నువ్వతన్ని లెక్కచేయడం లేదని అనుమానించవచ్చు. ఈ అనుమానాన్ని కొడుకులో కూడా ప్రవేశపెడితే ఏమవుతుంది? ఆయావ్యక్తుల కుటుంబాల నేపథ్యాన్ని సమాజం గుర్తు పెట్టుకునే వుంటుంది. ఆయా వ్యక్తులూ మరచి పోరు. మన ఆస్తి పోయినా నేను 'రామిరెడ్డి' గా నే వుండటానికీ, ఎంత సంపాదించినా అతను ఎల్లయ్య్య కాగలిగాడు కానీ 'ఎల్లారెడ్డి' కాలేకపోవడానికీ కారణమేమిటంటావు? నాది 'కుల' దృష్టికాదు. సామాజిక వాస్తవాలను చూస్తున్నది. నీ తండ్రి అభ్యుదయ భావాలు కలవాడన్నది నీకు తెలుసు.

ఆలోచించు. మధుతో కలిసి ఆలోచిస్తే మరీ మంచిది. నీ జాబు సంగతీ, నాజవాబు సంగతీ మీ అమ్మకింకా చెప్పలేదు. చెబుతాను. ఆమె కూడానన్నే సమర్థిస్తుందని నా నమ్మకం. మీ అమ్మేకాదు, మధును వాళ్ళనాన్న నడగమను. అతనికీ ఇలాంటి సందేహాలే వుంటాయి.

ఇట్లు,

మీ నాన్న

---

నాన్నకు,

మీరు హెచ్చరించినట్టూ జాగ్రత్తగా సావకాశంగా ఆలోచించాను. మధుతో కలసిఆలోచించడమే కాదు, కలిసే రాస్తున్నాం.

మీరన్నట్టూ మీవికొన్ని అభ్యుదయ భావాలే. అయితే మీవి భావాలైతే, మావి ఆచరణలు. అందువల్ల మీకు ఆదర్శాలుగా వున్నవి మాకు ఆచరణీయాలవుతాయి. ప్రత్యేకంగా అభ్యుదయభావాలంటూ లేకపోయినా, కొందరు అభ్యుదయ ఆచరణలోకి రాగలిగేది అందువల్లనే. సమాజం ఆమేరకు ఎదగడం వల్లనే. మీరూహించినట్లే మధు నాన్న కూడా సందేహాలను

వ్యక్తం చేశారట. మీరిద్దరూ గతానికి చెందిన మనుషులు. మేమిద్దరం భవిష్యత్తుకు చెందిన వాళ్ళం. మీ సమస్యలు మా సమస్యలు కావు. మాకూ సమస్యలు ఎదురు కావచ్చు. అప్పుడా లోచిస్తాం ఏంచెయ్యాలో.

నాన్నా! ఇంకో విషయం చెబితే బాధ పడకుండా మిమ్మల్ని మీరు పరిశీలించి చూసుకోండి. "నాది కులదృష్టి కాదు" అంటూనే, రెడ్డి అనిపించుకోడంలో ఏదో సామాజిక హోదావున్నట్టు భావించడమేమిటి? ఏ సామాజిక హోదా అది? చాలామంది నాన్నల కంటే మీరు నాకుఎక్కువ స్వాతంత్ర్యాన్ని ఇచ్చారు. మీరలావుండకపోతేనేనిలా వుండగలిగేదాన్ని కాదనేదీ నిజమే. అయితే, "నీకు నే నిచ్చిన స్వాతంత్ర్యం వల్ల "అంటూ ఉదారంగా ఇచ్చినట్టు భావిస్తున్నారా! నాస్వాతంత్ర్యం నాదికాదనుకుంటున్నారా? ఈ విధంగా స్వాతంత్ర్యం ఇవ్వడానికీ, ఇవ్వకపోడానికీ పెద్ద తేడాఏమైనా వుందా ?

అమ్మ కూడా మిమ్మల్నే సమర్థిస్తుందని ముందే చెప్పారు (కనీసం ఆమెకు విషయం చెప్పకుండానే). అమ్మను మీ కెట్లాకావాలో అట్లా తయారుచేసిన తర్వాత ఆమె అట్లాకాక, ఇంకెట్లా వుంటుంది? ఇంతకూ మేం చెప్పేదేమిటంటే, ఎన్నడో జరిగిన సంఘటన వద్దకు.......... అంటే యాభై యేళ్ళ వెనక్కి వెళ్ళవలసిన అవసరం మాకు లేదు, యాభై యేళ్ళు ముందుకు వెళ్ళవలసిన వాళ్ళం అన్నదే.

ఇట్లు,

మీ సుగుణ.

*(ఆకాశవాణి కడపకేంద్రం నుంచి 'కథాహారం' లో ప్రసారితం. బహుశా 1972 కానీ 1973 కానీ కావచ్చు)*

# -- కథ గురించి. . .

ఘంటసాల నిర్మల పాత 'వాణి' పత్రికలో యీ కథవుండనట్టు ఇటీవల తీసుకొచ్చి ఇచ్చేదాకా, రేడియోకోసం దీన్ని చదివినట్టు నాకు జ్ఞాపకమేలేదు. రాసిన కథల్లో కొన్ని మరిచి పోతగినవి వుంటాయి. అంటే, ఆవిధంగా మరచిపోవడంలో అందుకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయం వుంటుంది. (మరచిపోవాలని నిర్ణయించుకోడంలోనే మరచి పోకపోవడమూ వుంటుంది. ఆ తర్కం వేరే సంగతి)

అయితే, రాసిన సంగతే మరచి పోయిన కథను చూసినప్పుడు దానిమీద కొంత సానుభూతి కలుగుతుంది. నేరం చేసినట్టు 'గిల్టీ' గా ఫీలవుతాం.

రాసి, మరచిపోవాలనుకున్న కథల విషయంలో మనతప్పులు గుర్తుంటాయి. రాసిన సంగతే మరచిన కథవిషయంలో అటువంటి అవకాశం వుండదు. 'ఇందులో ఏం తప్పులు చేశామో' అనిపించడంతో పాటు. 'పాపం --- ఇన్నాళ్ళూ దిక్కూమొక్కూ లేనట్టు వుండి పోయిందా?' అనిపిస్తుంది.

ఈ కథలో తండ్రి ఎక్కడున్నాడు? కూతురెక్కడుంది ? వాళ్ళు వ్యక్తం చేసిన భావాలకు ప్రాతిపదిక ఏమిటి ? ఈ వివరాలేవీ లేవు. రెండు ఉత్తరాల రూపంలో వుండటంతో కథాశిల్పంతో కూడా లేదేమో !

అయితే, ఇవి చిన్నలోపాలే. పెద్దలోపం ఒకటుంది. అది తరాలమధ్య వున్న అంతరమే అభివృద్ధి నిరోధకంగానూ, అభివృద్ధికరంగానూ వున్నట్టు సూచించడం. సమాజం అభివృద్ధి వైపే ప్రయాణిస్తుందంటే అర్థం, తల్లిదండ్రులకన్నా పిల్లలు 'తప్పక' అభివృద్ధి కరంగా ఆలోచిస్తారనికాదు. కథలో వున్న యీలోపాన్ని ఒప్పుకుంటూ, ప్రచురించవచ్చని భావించాను. ఈ నిర్ణయానికి కథ మీద కలిగిన 'సానుభూతి' కారణమైనా కావచ్చు.